
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



ఫలితాలపై నజర్

ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేలా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారులు దృష్టి సారించారు. 8లో



వంద రోజుల ప్రణాళిక..

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక విజయవంతం చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. 8లో

గరిష్టం/కనిష్టం 31°/17°

వాతావరణం

జిల్లాలో మంగళవారం రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'ముక్కోటి' ఏర్పాట్లపై నేడు సమీక్ష

సింగరేణి(కొత్తగూడెం): వచ్చే ఏడాది జనవరి 9, 10 తేదీల్లో భద్రాచలం రామాలయంలో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించేందుకు మంగళవారం ఉదయం 11.30 గంటలకు భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వేడుకలకు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, వారికి కల్పించాల్సిన వసతి, సౌకర్యాలపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఆదేశించారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): పాల్వంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు ఈ నెల 22న నిర్వహించనుండగా సోమవారం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌రావు, డీఐఈఓ హెచ్.వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ పి.శంకర్, కళాశాల పూర్వ విద్యార్థి, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె.సంజీవరావు, పూర్వ విద్యార్థులు దొడ్డ రవి, కదలి శ్రీరామ్మూర్తి, కనగాల అనంతర రాములు, గజ్జి శ్రీనయ్య, నాగేశ్వరరావు, గోపాలకృష్ణ, పోచాల రావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

12న జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): హైదరాబాద్‌లోని హెటీరో నెక్సిటీలో ఉద్యోగుల ఎంపికకు ఈనెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలి పారు. కంపెనీలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు ఎస్సెస్సీ, ఐటీఐ, డిగ్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తిచేసిన వారు అర్హులని వెల్లడించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్లతో కొత్తగూడెం మండల పరిషత్ కార్యాలయంలో 12న ఉదయం 10 గంటలకు మొదలయ్యే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

ఈఓ సులోచనకు ఉత్తమ సర్వీస్ అవార్డు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని శ్రీ పాండురంగ భజన మందిరంలో గ్రేడ్–1 కార్యనిర్వహణాధికారిగా విధులు నిర్వహిస్తున్న కె.సులోచనను బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ) నిర్వాహకులు ది బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 15న న్యూఢిల్లీలో జరిగే బీఎస్ఏ 5వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో అవార్డును అందజేయనున్నారు. ఈ మేరకు సులోచన సోమవారం వివరాలు వెల్లడించారు.

రైల్వే సంబంధిత సమస్యలు పరిష్కరించండి

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైల్వేస్టేషన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీఆర్ఎస్ ఎంపీలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. ఢిల్లీలో సోమవారం సహచర ఎంపీలతో కలిసి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మంత్రికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రైళ్లను కోవిడ్ సమయాన రద్దు చేసినందున వాటిని పునరుద్ధరించడంతో పాటు అదనంగా మరికొన్ని రైళ్లు నడపాలని, తిరుపతికి వెళ్లేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటుచేయాలని, గాంధీపురం, కారేపల్లి స్టేషన్ల అభివృద్ధి, ఖమ్మం స్టేషన్లో బీహార్, జైపూర్ వెళ్లే రైళ్లను ఆపాలని కోరారు. కాగా, తమ వినతులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఎంపీ రవిచంద్ర తెలిపారు.

అటు మేఘాలు.. ఇటు దళారులు



వర్షం భయంతో ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు

ఊపందుకుంటున్న ధాన్యం కొనుగోళ్లు

- రైతులకు ఇబ్బందిగా మారిన తేమ శాతం
- సన్నకారు రైతులపై ప్రైవేటు వ్యాపారుల కన్ను
- తక్కువ ధరకే అమ్ముకుంటున్న అన్నదాతలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: చెమటోడ్చి పండించిన పంటకు ప్రతిఫలం పొందడం సన్న చిన్నకారు రైతులకు తలకు మించిన భారంగా మారుతోంది. ఓవైపు ఆకాశాన్ని కమ్మిన మేఘాలు కలవర పెడుతుంటే.. మరోవైపు మాటువేసిన ప్రైవేటు వ్యాపారులు అదను కోసం ఎదురుచూస్తున్నారు.

1.60 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాకు తలాపునే గోదావరి ప్రవహిస్తున్నా పంట పొలాలను మాత్రం తడపడం లేదు. వ్యవసాయానికి ప్రధాన ఆధారం వర్షమే కావడంతో ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 1.60 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా.. మోటార్ల కింద పండించిన ధాన్యం రెండు వారాలుగా కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. ఇక చెరువులపై ఆధారపడి వేసిన పొలాలు కోతలకు వచ్చాయి. దీంతో రాబోయే రెండు మూడు వారాల్లో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం మరింతగా పోటెత్తనుంది. అయితే రైతులకు దక్కాల్సిన సన్నరకం ధాన్యపు బోనస్.. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ప్రైవేటు వ్యాపారులు, దళారుల పాలవుతోంది.

తేమతో ఇబ్బందులు..

సన్నరకం వరి ధాన్యానికి క్వింటాకు రూ.2,320 మద్దతు ధరతో పాటు అదనంగా మరో రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఈసారి సన్న రకం ధాన్యాన్నే రైతులు ఎక్కువగా సాగు చేశారు. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు తేమ కీలకంగా మారింది. 17 శాతం కంటే తక్కువ తేమ ఉంటేనే కొనుగోలు చేయాలని నిబంధనలు ఉన్నాయి. పంటను కోసినప్పుడు నేల రకం, అప్పటి ఉష్ణోగ్రతలను బట్టి ధాన్యంలో 35 నుంచి 40 శాతం వరకు తేమ ఉంటోంది. దీంతో తేమ శాతం తగ్గే వరకు ధాన్యాన్ని ఆరబెట్టాల్సి వస్తోంది. కాగా, అల్పపీడనం ప్రభావంతో ఆకాశంలో కమ్ముకుంటున్న మేఘాలు రైతులను కలవరపాటుకు గురి చేస్తున్నాయి.

చుట్టేస్తున్న దళారులు..

చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్నట్టుగా తయారైంది. ఇదే సమయంలో ప్రైవేటు వ్యాపారులు, దళారులు గ్రామాలను చుట్టి ముట్టేస్తున్నారు. చిన్న రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. ఈ ధాన్యానికి 'మేనేజ్‌మెంట్ స్కిల్స్' జోడించి ప్రభుత్వం అందించే బోనస్‌ను తమ ఖాతాల్లోకి మళ్లిస్తున్నారు. దీంతో రైతుల కష్టానికి ప్రతిఫలం దక్కకపోగా ప్రైవేటు వ్యాపారుల ఖజానా నిండుతోంది.



రోడ్డుపైనే ధాన్యం ఆరబోసిన రైతులు

ఖర్చు.. తడిసి మోపెడు

పంటను కోసిన తర్వాత తేమ శాతం తగ్గేందుకు కనీసం రెండు వారాలు ఆగాల్సి వస్తోంది. ఆ తర్వాత ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు రవాణా చార్జీలు ఎకరానికి రూ. 2 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. అక్కడ తూర్పార పట్టేందుకు ఎకరం భూమిలో పండిన ధాన్యానికి రూ.800 ఖర్చవుతోంది. ఐదు ఎకరాలకు మించి సాగు చేసిన రైతులకే ఈ ఖర్చులు పోను లాభం వచ్చే పరిస్థితి నెలకొంది. ఐదెకరాలకు లోపు సాగు చేసిన వారికి బోనస్ ద్వారా వచ్చే అదనపు లాభం కొనుగోలు కేంద్రాల దగ్గర వచ్చే ఖర్చులకే సరిపోతోంది. మరోవైపు ముసురుకునే మబ్బులు అసలుకే ఎసరు తెచ్చేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్ష భయం వెంటాడుతోంది



మూడు రోజులుగా ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోసి ఇక్కడే ఉంటున్నాం. ప్రస్తుతం వర్షం కురిసే ఆనవాళ్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డుపై ఉన్న ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతున్నాం.
– బీమల వినోద్, నాయకులగూడెం, ఇల్లెందు మండలం

ఇరవై రోజులుగా ఇక్కడే



ఇరవై రోజులుగా ధాన్యాన్ని ఆరబెట్టడంతో ఇప్పుడు తేమ 18 శాతానికి వచ్చింది. గత మూడు వారాలుగా నేను ధాన్యంతో పాటు కొనుగోలు కేంద్రంలోనే ఉంటున్నాను. ప్రతీ రోజు నాతో పాటు ఇద్దరు కూలీలతో పని చేయించాల్సి వచ్చింది.
– నాగరాజు, రాఘవాపురం, సుజాతనగర్ మండలం

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారు ముత్తంగా రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. ముందుగా తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముగిసిన ప్రజా పాలన ఉత్సవాలు



గిరి ప్రదక్షిణ చేస్తున్న ఈఓ రమాదేవి, భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో వారం రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రాగణంలోని గోశాల వద్ద గోపూజ కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోంగా నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల కోలాటాల నడుమ గిరి ప్రదక్షిణ కనులపండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, సిబ్బంది సాయిబాబా, చిట్టి హనుమత్‌శాస్త్రి, ప్రసాద్, నరసింహాచారి, కామేశ్వర శర్మ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలకు న్యాక్ బృందం

- వసతులు, సౌకర్యాల పరిశీలన
- కేంద్రానికి నివేదిక అందిస్తామని వెల్లడి



న్యాక్ బృందం సభ్యులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

అశ్వాపురం : మండల పరిధిలోని మిట్టగూడెంలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) బృందం సోమవారం సందర్శించింది. న్యాక్ చైర్మన్ ప్రొఫెసర్ ఎల్లప్ప మునిరాజ్ ఆధ్వర్యంలో సభ్యులు లాత్రిన్ తుంగ, దిలీప్‌సేథ్ కళాశాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, వసతులు, సౌకర్యాలు, అడ్మినిస్ట్రేషన్ వంటి పలు అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎల్లప్ప మునిరాజ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఏర్పాటైన నాటి నుంచి ఐదేళ్ల కాలంలో కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, చదువులో పూర్వ విద్యార్థుల నైపుణ్యం, ప్రస్తుత విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించామని వివరించారు. తమ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని, దాని ఆధారంగా కళాశాలకు గ్రేడ్ ప్రకటిస్తామని తెలిపారు. అనంతరం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి నిధులు విడుదలవుతాయని వెల్లడించారు.

న్యాక్ బృందాన్ని కలిసిన పీఓ..

మిట్టగూడెంలోని గురుకుల బాలుర డిగ్రీ కళాశాల సందర్శనకు వచ్చిన న్యాక్ బృందాన్ని మణుగూరులోని ఇల్లెందు అతిథి గృహంలో ఐటీడీఏ పీఓ రాహుల్ మర్యాద పూర్వకంగా కలిశారు. కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలకు సంబంధించిన అంశాలను వారికి పీఓ వివరించారు. విద్యార్థులకు మెనూతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన, ల్యాబోరేటరీ సౌకర్యం, కంప్యూటర్ శిక్షణ, ప్రత్యేక తరగతులు, విశాలమైన ఆటస్థలం, సైన్స్‌ల్యాబ్, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా అత్యాధునిక సౌకర్యాలు, అన్ని వసతులతో విద్యాబోధన అందిస్తున్నామని, విద్యార్థులకు ఆటవిడుపుగా విహారయాత్రలకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో గురుకులం ఆర్సీఓ నాగార్జునరావు, కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం
- ప్రజావాణిలో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సింగరేణి(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- చండ్రుగొండ మండలం రావికంపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో 2011 – 12 నిధుల కింద అదనపు గదులు నిర్మిస్తే నేటికీ బిల్లులు జమ కాలేదని కాంట్రాక్టర్ భూపతి శ్రీనివాస్‌రావు దరఖాస్తు అందజేయగా, ఐటీడీఏ పీఓకు ఎండార్స్ చేశారు.
- సుజాతనగర్ మండలం వేపలగడ్డలో సర్వే నంబర్ 446లో 16 గుంటలు, 447లో 22 గుంటల భూమి వారసత్వంగా వచ్చిందని, ఆ భూమికి పట్టా మంజూరు చేయాలని బానోత్ విజయకుమారి దరఖాస్తు చేశారు.
- పాల్వంచ మండలం కొత్తసూరారం రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో మీసేవా కేంద్రాలు అందుబాటులో లేవని, పాల్వంచ మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని భూక్యా కళ్యాణ్ ఫిర్యాదు చేశారు. కొత్తగా మీ సేవా కేంద్రం మంజూరు చేయాలని కోరారు.
- నెల వయసు గల తన కుమారుడికి ఆరోగ్యం బాగోలేక అర్ధరాత్రి ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లామని, అక్కడ నైట్ డ్యూటీ డాక్టర్లు అందుబాటులో లేరని, విధుల్లో ఉన్న సిబ్బంది కనీసం తమను చూడకుండానే బయటకు పంపించారని ఇల్లెందు మండలం మామిడి గుండాల గ్రామానికి చెందిన ముక్తి కొమరయ్య ఫిర్యాదు చేశాడు. తెల్లవారి బస్సులు నడిచేవరకు ఉంటామన్నా వినలేదని, సదరు సిబ్బందిపై చర్య తీసుకోవాలని కోరాడు.
- కొత్తగూడెం పట్టణ పరిధి 35వ వార్డులో కమిటీ హాల్ నిర్మించాలని కోరుతూ కౌన్సిలర్ రుక్మాంగధర్‌బండారి ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వార్డుకు రూ.50 లక్షల మంజూరై, టెండర్ పూర్తయినా స్థలం లేక పనులు జరగడం లేదని, సింగరేణి స్థలాన్ని కేటాయించాలని కోరారు.
- కొత్తగూడెం పట్టణ పరిధిలోని 29వ వార్డు వార్డులో డ్వాక్రా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు చెట్ల కింద సమావేశాలు నిర్వహించాల్సి వస్తోందని, వార్డు పరిధిలో ఒక కమిటీ హాల్, ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ తంగేళ్ల లక్ష్మణ్ వినతిపత్రం సమర్పించారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

- టూరిజం, క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా
- పెదవాగు, మూకమామిడి ప్రాజెక్టుల ఆధునికీకరణకు ప్రణాళికలు

ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



సాక్షి INTERVIEW

అశ్వారావుపేట : ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెడతానని, అశ్వారావుపేట నియోజకవర్గంలో టూరిజం, క్రీడల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని, మూకమామిడి, పెదవాగు ప్రాజెక్టుల ఆధునికీకరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. అశ్వారావుపేట నియోజకవర్గానికి నేను సొంతంగా ఎన్నికల హామీలు ఏమీ ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలనే హామీలుగా వెల్లడించాం. ఈ ఏడాది కాలంలో మండల కేంద్రాల్లో సెంట్రల్ లైటింగ్, మినీ స్టేడియాలు ఏర్పాటు చేశాం. ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నాం. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఇప్పటివరకు రూ.48.40 కోట్లు మంజూరు చేయించా. వచ్చే నాలుగేళ్లలో ప్రతీ పథకంలో నియోజకవర్గానికి మెండుగా నిధులు రాబట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నా. మండలాల స్థాయిలో మేమెవరికీ పెత్తనాలు ఇవ్వలేదు. మండలాల్లో పార్టీ బాధ్యులు ఒకరు ఉంటారు తప్పితే షాడో ఎమ్మెల్యేలూ ఎవరూ లేరు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని మా నివాసం(క్యాంపు కార్యాలయం)లో నేనే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా. ఇక పార్టీలో పాత, కొత్త అనే అంతరాలు లేవు. అయితే కొందరు మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న మాట వాస్తవమే. ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నాం.

అక్రమ రవాణాను ప్రోత్సహించను..

ఇసుక, మట్టి అక్రమ రవాణాను ప్రోత్సహించడం లేదు. అక్రమ వ్యాపారాలు ఎవరు చేస్తున్నారో కూడా తెలియదు. ఆయా మండలాల సహజ వనరుల సౌలభ్యాన్ని బట్టి అనాదిగా జరుగుతున్న తంతే తప్ప నా అనుచరులు ఈ దందా చేయమని ఎవరికీ చెప్పలేదు. అక్రమార్కులకు వదిలిపెట్టాలని నేనే ఏ అధికారికి కూడా చెప్పలేదు. ఇక పెదవాగు, మూకమామిడి ప్రాజెక్టుల ఆధునికీకరణకు అంచనాలు తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాం. వారి అంచనాలు అందగానే ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు కృషి చేస్తా. నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగు అధికంగా ఉంది. ఆయిల్‌ఫెడ్‌కు ఏ విధమైన నిధులు కావాలన్నా, ఆయిల్ పామ్ రైతులకు పరికరాలు, ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తా. భద్రాచలం వెళ్లే భక్తులు మార్గమధ్యంలో మూకమామిడి, నల్లముడి పురాతన గుహలు, అశ్వారావుపేట మండల శివారులోని గుబ్బలమంగమ్మ ఆలయాలను సందర్శించేలా టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తాం. నియోజకవర్గానికి మినీ స్టేడియం ఇప్పటికే మంజూరైంది. క్రీడల అభివృద్ధికి స్పోర్ట్స్ స్కూల్ సాధించడంతో పాటు ఇక్కడే జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహణకు ప్రయత్నం చేస్తున్నాం.

ఏసీబీకి చిక్కిన ఖజానా శాఖ ఉద్యోగి

- పెన్షనర్ సతీమణి నుంచి రూ.40వేలు డిమాండ్
- ఖమ్మం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో పట్టుకున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఏళ్ల తరబడి ఉద్యోగం చేసి రిటైర్డ్ అయిన వ్యక్తి కన్నుమూయగా.. ఆయనకు సంబంధించి బకాయిల బిల్లు చేసేందుకు లంచం డిమాండ్ చేసిన ఉద్యోగిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వివరాలు... తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు పీహెచ్‌సీలో అటెండర్‌గా పనిచేసిన ఓ వ్యక్తి ఉద్యోగ విరమణ చేయగా ఇటీవల మరణించాడు. ఆయనకు సంబంధించి రూ.4లక్షలు రావాల్సి ఉండడంతో మృతుడి సతీమణి ఖమ్మం జిల్లా ఖజానా శాఖలోని పెన్షన్ సెక్షన్‌లో సంప్రదించారు. దీంతో సీనియర్ అకౌంటెంట్ కట్టా నగేష్ రూ.4లక్షలకు గాను పది శాతం మేర రూ.40వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈమేరకు బాధితురాలు అక్టోబర్‌లో ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. వారు బాధితులు సదరు ఉద్యోగితో మాట్లాడిన ఆడియోలు, వీడియోలు సేకరించారు. అనంతరం సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయానికి ఆమెను పిలిపించి లంచం విషయమై మాట్లాడుతున్న నగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవమైన సోమవారం సదరు ఉద్యోగి పట్టుబడడం, అదీ కలెక్టరేట్‌లో కావడం గమనార్హం.

లంచం అడిగినా నేరమే..

ఏసీబీ ఖమ్మం డీఎస్పీ వై.రమేష్ మాట్లాడుతూ లంచం ఇవ్వడం, తీసుకోవడమే కాక డిమాండ్ చేసినప్పటికీ నేరంగా పరిగణిస్తామని వెల్లడించారు. అందులో భాగంగానే పెన్షనర్ సతీమణి నుంచి నగేష్ లంచం డిమాండ్ చేయడంతో అన్ని ఆధారాలు సేకరించాక అరెస్ట్ చేశామని తెలిపారు.

ఖజానా శాఖలో కాసుల గలగల

ప్రతీ సోమవారం ప్రజావాణి జరిగే కలెక్టరేట్‌లో హడావుడి ఉంటుంది. ఈమేరకు కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో మధ్యాహ్నం 12గంటల సమయాన ఉద్యోగి ఏసీబీకి చిక్కాడని తెలియడంతో అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కలెక్టరేట్ ప్రారంభమై 23 నెలలు గడుస్తుండగా ఇందులో 31శాఖల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా ఏసీబీ అధికారులకు ఖజానా శాఖ సీనియర్ అకౌంటెంట్ నగేష్ పట్టుపడడం గమనార్హం. కాగా, ఖజానా శాఖ కార్యాలయంలోని కొందరు ఉద్యోగులు ఇతర శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లను పర్సంటేజీల పేరుతో వేధిస్తున్నారని ఆరోపణలున్నాయి. కొందరు ఉద్యోగులు ఏళ్ల తరబడి ఒకే సెక్షన్‌లో పనిచేస్తుండడం, ఇతర చోట్లకు బదిలీ చేసినా మళ్లీ డిప్యూటేషన్‌పై వస్తున్నారు. ఇటీవల బదిలీలు జరిగినా... వేరే ప్రాంతానికి వెళ్లిన ఓ ఉద్యోగి మళ్లీ డిప్యూటేషన్‌పై వచ్చి అదే సెక్షన్ తీసుకోవడం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది. అంతే కాక శాఖలో అధికారులు, ఉద్యోగుల మధ్య అంతర్గత పోరు మొదలైనట్లు సమాచారం. ఈక్రమంలోనే ఓ అధికారి కొందరు ఉద్యోగులను పిలిచి సెక్షన్ల వారీగా నగదు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈనేపథ్యాన ఏసీబీ దృష్టి సారించడంతో ఖజానా శాఖతో పాటు ఇతర శాఖల ఉద్యోగుల్లోనూ ఆందోళన మొదలైంది.



సీనియర్ అకౌంటెంట్ నగేష్

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



దామోదర్‌రావును సన్మానిస్తున్న కార్మికులు

మణుగూరు టౌన్: వ్యక్తిగత రక్షణ పరికరాలు, మెరుగైన పర్యవేక్షణ, పనిలో అంకితభావం, సమష్టి కృషి, సమయపాలన వంటివి రక్షణతో కూడిన పనికి దోహదపడతాయని రక్షణ తనిఖీ బృందం కన్వీనర్, జీఎం(ఈ అండ్‌ఎం) దామోదర్‌రావు అన్నారు. సింగరేణి 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల సందర్భంగా సోమవారం మణుగూరులో పర్యటించిన ఆయన వర్క్‌షాప్‌లో కార్మికులతో మాట్లాడారు. విద్యుత్ రక్షణ పాటించి పనిచేస్తే జగతికి వెలుగునిస్తుందని, నిర్లక్ష్యంగా పనిచేస్తే జీవితంలో చీకటిని మిగులుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు వేముల శ్రీనివాస్, ఆదినారాయణ స్వీయ దర్శకత్వంలో ప్రదర్శించిన 'రక్షణే శ్రీరామరక్ష' నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధికారులు వెంకట రామారావు, అప్పారావు, నరేంద్రకుమార్, డాక్టర్ రాజ్‌కుమార్, నాగసాయి సందీప్, కోదండరాం, మదన్‌గోపాల్, గంగాధర్, షాబుద్దీన్, జంపాల శ్రీనివాస్, అధికారులు శోభన్, విజయ్‌పాల్, భాస్కర్, శ్రీనివాస్, వెంకట్, కొత్త సత్యనారాయణ, షణ్ముఖ పాల్గొన్నారు. అనంతరం దామోదర్‌రావును కార్మికులు, అధికారులు సత్కరించారు.

క్లుప్తంగా

నేటి నుంచి 'సీతారామ' గ్రామసభలు

బూర్గంపాడు: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ ఒకటో ప్యాకేజీలో డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు మంగళవారం నుంచి పెసా గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ జె.కార్తీక్ సోమవారం వివరాలు వెల్లడించారు. బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్, నకిరిపేట, మోరంపల్లిబంజర, సోంపల్లి గ్రామాల్లో మంగళవారం, ఇరవెండి, నాగినేనిప్రోలు, పినపాక పట్టీనగర్ గ్రామపంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహిస్తామని వివరించారు. సీతారామ డిస్ట్రిబ్యూటరీ కాలువలకు బూర్గంపాడు మండలంలో 366 ఎకరాల భూమి సేకరించనున్నట్లు తెలిపారు. పెసా గ్రామసభలను విజయవంతం చేయాలని కోరారు.

ఉత్పత్తి, ఉత్పాదకతపై అవగాహన



మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఉత్పాదకత స్థితిగతులపై అవగాహన కల్పించేందుకే సింగరేణి యాజమాన్యం మల్టీ డిపార్ట్‌మెంటల్ పర్యవేక్షణ చేపట్టిందని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు తెలిపారు. సోమవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం ఏరియాలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు అన్ని ఉపరితల, భూగర్భ గనుల్లో మల్టీ డిపార్ట్‌మెంటల్ టీం సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికులు, అధికారులు అంకితభావంతో, సమష్టి కృషితో సంస్థను ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు. అనంతరం వివిధ కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎన్.యోహాన్, జీవీ కోటిరెడ్డి, సుమలత, శివకేశవరావు, సూర్యనారాయణ రాజు, బి.రవీందర్, ఎం.రమేష్, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జీ.గట్టయ్య, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రసిడెంట్ ఎండీ. రజాక్ పాల్గొన్నారు.

సీపీఆర్ఎంఎస్ స్కీమ్‌కు మరో అవకాశం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు సీపీఆర్ఎంఎస్ స్కీమ్‌లో చేరేందుకు కోలిండియా బోర్డ్ ఆఫ్ ట్రస్టీ మరో అవకాశం కల్పించిందని బీఎంఎస్ జాతీయ నాయకుడు పి.మాధవ నాయక్ తెలిపారు. సోమవారం రాయ్‌పూర్‌లో జరిగిన ట్రస్ట్ సమావేశంలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. రూ. 60 వేలు చెల్లిస్తే దంపతులకు రూ. 8 లక్షల వరకు వైద్యం అందుతుందని వెల్లడించారు. పథకంలో చేరేందుకు 2025, మార్చి 30 వరకు అవకాశం ఉందని తెలిపారు.


జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలను అందుకుంటున్న విద్యార్థులు

మణుగూరు రూరల్ : హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈ నెల 8న జరిగిన జాతీయ కరాటే చాంపియన్‌షిప్–2024లో మణుగూరుకు చెందిన కరాటే విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు కరాటే మాస్టర్ కాశిమల్ల పద్మ సోమవారం వివరాలు వెల్లడించారు. బ్లాక్‌బెల్ట్ అండర్–14 బాలికల కటా విభాగంలో గుగులోత్ రిషిక, అండర్–12 బ్రౌన్‌బెల్ట్ బాలుర విభాగంలో సాయ జ్ఞానేష్, అండర్–10 ఎల్లో బెల్ట్ విభాగంలో గుగులోత్ ధృవిక పతకాలు సాధించారని తెలిపారు. విజేతలను మాస్టర్ కేశవ్ అభినందించారు.


సర్వే వేగంగా పూర్తి చేయాలి



జమలాపురంలో సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

మధిర/ఎర్రుపాలెం: ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు చేపట్టిన సర్వేను ఈనెల 19వ తేదీకల్లా పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. మధిర మండలం దెందుకూరు, ఎర్రుపాలెం మండలం కండ్రిక, జమలాపురంల్లో సోమవారం ప్రారంభమైన సర్వేను ఆమె పరిశీలించారు. ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా కొందరి ఇళ్లలో స్వయంగా వివరాలు సేకరించిన ఆమె ఎలాంటి పొరపాట్లు లేకుండా యాప్‌లో నమోదు చేయాలని ఉద్యోగులకు సూచించారు. తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓలు టీవీఎల్ ఎన్.శాస్త్రి, శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బండి నాగేంద్రబాబు, అంగన్‌వాడీ సిబ్బంది సావిత్రి, కృపమ్మ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

ఫలితాలపై నజర్



కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ఇంటర్ ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు అధికారుల చర్యలు
- మూడు నెలలపాటు యాక్షన్ ప్లాన్ అమలు
- ఇప్పటినుంచే విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్న అధ్యాపకులు
- గతేడాది ఫలితాల్లో రాష్ట్రంలో 9వ స్థానానికి పడిపోయిన జిల్లా

కొత్తగూడెంఅర్బన్: ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేలా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు దృష్టిసారించారు. ఇందుకోసం యాక్షన్ ప్లాన్ రూపొందించే పనిలో ఉన్నారు. జిల్లాలో గతేడాది ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ఆశించిన ఫలితాలు రాలేదు. ఫస్టియర్‌లో 54.83ఉత్తీర్ణతా శాతం, ద్వితీయ సంవత్సరంలో 70.72 ఉత్తీర్ణతా శాతం నమోదైంది. రాష్ట్రంలో జిల్లా 9వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరంలో సగం శాతం వరకే ఉత్తీర్ణత నమోదైంది. దీంతో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపడుతున్నారు.

ప్రతీ కళాశాల సందర్శన

జిల్లాలో 14 ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలు ఉండగా, జిల్లా నోడల్ అధికారి చర్యలు చేపడుతున్నారు. వారం నుంచి ప్రతి కళాశాలను విజిట్ చేస్తున్నారు. ఉత్తీర్ణతాశాతం పెంచేలా ప్రిన్సిపాల్స్, లెక్చరర్లకు మార్గనిర్దేశనం చేస్తున్నారు. విద్యార్థులకు స్పెషల్ క్లాసులు, టెస్టులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా సమావేశాలు నిర్వహించి, ఫలితాల సాధనకు వారి సహకారం కూడా తీసుకోవాలని నిర్ణయించారు. ప్రైవేటు, కార్పొరేట్‌కు కళాశాలలకు దీటుగా ఫలితాలు రాబట్టాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

కార్యాచరణ ఇలా...

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఇంకా మూడు నెలలపాటు సమయం ఉంది. ఈలోగా అధ్యాపకులు వారి సబ్జెక్ట్‌లకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారు చేయాల్సి ఉంటుంది. ఆ ప్రణాళికను అమలు చేస్తూ ప్రతీ విద్యార్థి కూడా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి. ఇప్పటికే అధ్యాపకులు, విద్యార్థులు రోజూ కళాశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. కళాశాలకు సక్రమంగారాని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. గైర్హాజరైతే తల్లిదండ్రులకు సమాచారం ఇస్తున్నారు. కేర్ టేకర్స్ ప్రత్యేక రిజిస్టర్ రూపొందించి విద్యార్థుల ప్రగతిని నమోదు చేస్తున్నారు. స్లిప్ టెస్టులు, యూనిట్ టెస్టులు సకాలంలో పూర్తి చేయడం, గత నాలుగేళ్ల పరీక్ష పేపర్లు విద్యార్థుల చేత ప్రాక్టీస్ చేయించాలని అధ్యాపకులను ఆదేశించారు.

పోటీ పరీక్షలకు సైతం..

అధ్యాపకులు ఉత్తీర్ణత పెంచేందుకు చర్యలు చేపట్టడంతోపాటు వివిధ పోటీ పరీక్షలకు కూడా సంసిద్ధులను చేస్తున్నారు. ఇంటర్మీడియట్ వయసులో విద్యార్థులు చెడు వ్యసనాలకు అటువాటుపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో వ్యసనాల జోలికి వెళ్లకుండా తగిన పర్యవేక్షిస్తూ, సామాజిక అవగాహన పెంపొందిస్తున్నారు. మానసిక వేదన, క్షణికావేశాలకు గురికాకుండా కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

సమష్టి కృషితో..



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో యాక్షన్ ప్లాన్ తప్పనిసరిగా అమలు చేయాలి. గత ఏడాది కంటే కూడా ఈ విద్యా సంవత్సరం ఉత్తీర్ణతా శాతం పెంచాలి. అందుకు కళాశాలల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు సమష్టిగా కృషి చేయాలి. మెరుగైన ఫలితాలు సాధించాలి.

–వెంకటేశ్వరరావు, జిలా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి

ఫలితాల పెంపునకు దోహదం



ఇంటర్మీడియట్‌లో మెరుగైన ఫలితాల సాధనకు యాక్షన్ ప్లాన్ ఉపయోగపడుతుంది. యాక్షన్ ప్లాన్ విద్యార్థులు అనుసరించాలంటే తల్లిదండ్రులు కూడా నిత్యం పర్యవేక్షించాలి. విద్యార్థులంతా మంచి మార్కులతో సాధించేలా కృషి చేయాలి.

–ఎండి.ఖుర్షీద్‌అహ్మద్, లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

ఉపాధి సిబ్బందికి జరిమానా



సామాజిక తనిఖీ చర్చా వేదికలో అడిషనల్ డీఆర్‌డీఓ తదితరులు

దమ్మపేట: ఉపాధి హామీ మస్టర్లు, ఇతర వివరాలను తారుమారు చేసే ప్రయత్నంలో రికార్డుల్లో దిద్దుళ్లు, కొట్టివేతలకు పాల్పడిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.22,506 జరిమానా విధించినట్లు జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ ఎ.రవి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో 2023–24 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదికను మండల ప్రత్యేక అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీల్లో వేతనాల వ్యయం రూ.4,43,80,373లు, సామగ్రి వ్యయం రూ.32,32,330 కాగా మొత్తం వ్యయం రూ.4,76,12,703లపై సామాజిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్‌పీసీఐ కారణంగా 23 మందికి కూలీలకు వేతనాలు జమకాకపోవడం, హరిత హారంలో భాగంగా నాటిన మొక్కలు, రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో నాటిన కొబ్బరి మొక్కలు చనిపోయినట్లు గుర్తించారు. నూతనంగా 62 మందికి ఉపాధి హామీ జాబ్ కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. కాగా జరిమానా విధించిన మొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవికుమార్, ఎంపీడీఓ రవీంద్ర రెడ్డి, ఎంపీఓ రామారావు, ఏపీఓ సుధాకర్, విజిలెన్స్ అధికారి రమణ, ఇరిగేషన్ ఏఈ గోపాలరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

285 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్



బియ్యాన్ని జీసీసీ గోదాంలో దింపుతున్న కార్మికులు

భద్రాచలంటౌన్: ఏపీలోని విజయవాడ హనుమాన్ జంక్షన్ నుంచి అక్రమంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సివిల్ పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం పట్టుకున్నారు. భద్రాచలం డీటీ సుంకరి శ్రీనివాస్ కథనం ప్రకారం.. పట్టణంలోని ఫారెస్ట్ చెక్ పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఆ లారీ ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో సిబ్బంది వెంబడించి డిగ్రీ కళాశాల వద్ద పట్టుకున్నారు. తనిఖీ చేయగా 285 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. బియ్యాన్ని సీజ్ చేసి జీసీసీ గోదాంలో నిల్వ చేశారు. నిందితుడిని పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

ఇల్లెందు యువకుడు మణుగూరులో బలవన్మరణం



సునీల్ (ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని నంబర్ – 2 బస్తీకి చెందిన బొట్ల సునీల్(30) సోమవారం మణుగూరులోని బొంబాయి కాలనీలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సునీల్ బంధువులు, నంబర్ – 2 బస్తీ వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. సునీల్‌కు భార్యతో కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో మణుగూరులోని బొంబాయి కాలనీలో గల సోదరుడి ఇంటికి వెళ్లాడు. కాగా, సోమవారం అతడి సోదరుడు డ్యూటీకి వెళ్లిన తర్వాత ఇంట్లో ఒంటరిగా ఉన్న సునీల్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు బస్తీ వాసులు తెలిపారు. సునీల్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

రైలుకింద పడి యువకుడు...

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన పిన్నెల్లి ఉపేందర్‌రావు(20) స్థానిక రైల్వేగేట్ సమీపాన సోమవారం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాల... మద్యానికి బానిసైన ఉపేందర్‌రావు తరచుగా తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాడు. అప్పుడప్పుడు మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తించే ఆయన మద్యం సేవించాక విజయవాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..

ముదిగొండ: పురుగుల మందు తాగిన మహిళకు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మండలంలోని రాఘవపురానికి చెందిన చిన్నబోయిన సుధ ముదిగొండలో గ్రామదీపికగా పనిచేస్తోంది. సుధ – ఉపేందర్ దంపతుల మధ్య మనస్పర్థలు, అప్పుల కారణంగా పది రోజుల క్రితం ఆమె పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందింది

చెరువులో పడి వ్యక్తి...

తల్లాడ: చెరువులో పడినో వ్యక్తి మృతి చెందగా సోమవారం మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు... తల్లాడకు చెందిన తడికమళ్ల వెంకటేశ్వర్లు(55) ఈనెల 7న మధ్యాహ్నం కూలి పనికి వెళ్లొచ్చాక ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఆరోజు నుంచి వెంకటేశ్వర్లు కనిపించకపోవడంతో ఆయన కోసం కుటుంబీకులు గాలిస్తున్నారు. ఇంతలోనే వారి ఇంటికి సమీపాన ఉన్న గుంటు చెరువుకట్టపై చెప్పులు కనిపించగా గాలించడంతో ఆయన మృతదేహం బయటపడింది. అప్పటికే మృతదేహం కుళ్లిపోవడంతో పొక్లెయినర్ సాయంతో బయటకు తీయగా స్థానికంగానే పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శశికుమార్ తెలిపారు. అయితే, వెంకటేశ్వర్లు చెరువులో ఎలా పడ్డాడో తెలియరాలేదు.

పూడ్చిన మృతదేహాన్ని తీసి పంచనామా

కొట్టి చంపారనే అనుమానంతో ఫిర్యాదు

కారేపల్లి: మండలంలోని మాణిక్యారం గ్రామపంచాయతీ పరిధి రూప్లాతండా గ్రామంలో ఈనెల 6వ తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తిని ఖననం చేయగా, ఆయన సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు సోమవారం మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా చేపట్టారు. రూప్లాతండాకు చెందిన బధరుడు, మతిస్థిమితం లేని భూక్యా హరిదాస్(45) ఈనెల 6న జీపీ బోరుబావి వద్ద మృతి చెంది కనిపించాడు. దీంతో విద్యుదాఘాతంతో చనిపోయి ఉంటాడని భావిస్తూ అంత్యక్రియలు నిర్వహించారు. అయితే, అదేగ్రామానికి చెందిన నూనావత్ బావ్‌సింగ్ పత్తి చేనులో హరిదాస్ పత్తి దొంగిలించాడనే నెపంతో కొట్టగా మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. ఈక్రమంలోనే హరి కుటుంబీకులు బావ్‌సింగ్ దంపతులపై దాడి చేశారు. ఆపై మృతుడి సోదరుడు సక్రు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్‌ఐ ఎస్.రాజారాం, తహసీల్దార్ సంపత్‌కుమార్ ఆధ్వర్యాన హరిదాస్ మృతదేహాన్ని బయటకు తీయించి మెడికల్ కాలేజీ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రాథోడ్ ఆధ్వర్యాన పంచనామా నిర్వహించారు. అలాగే, దాడి జరిగినట్లు భావిస్తున్న ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీలు చేపట్టారు.

ఆన్‌లైన్‌లో గేమ్ ఆడి..

- రూ.28 వేలు పోగొట్టుకున్న మహిళ

పాల్వంచరూరల్: సెల్‌ఫోన్ ఆన్‌లైన్‌లో గేమ్ ఆడిన మహిళ రూ.28 వేలు పోగొట్టుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బిక్కుతండాకు చెందిన దారవత్ విజయ తన సెల్‌ఫోన్‌లో ఇటీవల ఆన్‌లైన్ గేమ్ ఆడింది. దీంతో రూ. 28 వేలు పోగొట్టుకుని మోసపోయింది. బాధితుల ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ సోమవారం తెలిపారు.

మహిళ అదృశ్యం

ఇల్లెందు: ఓ మహిళ అదృశ్యంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బాలాజీనగర్‌కు చెందిన తాటి శైలజ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త తాటి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

మందు పాతరను నిర్వీర్యం చేసిన భద్రతా బలగాలు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరను సోమవారం భద్రతా బలగాలు గుర్తించి నిర్వీర్యం చేశాయి. బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్ స్టేషన్ పరిధి మోకూరు, పెద్ద గెల్లూరు గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని 5 కిలోల మందుపాతర ఏర్పాటు చేశారు. కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన సీఆర్‌పీఎఫ్ 168, 229 బెటాలియన్ సిబ్బంది గుర్తించి, నిర్వీర్యం చేయడంతో ప్రమాదం తప్పింది.

గుడుంబా సామగ్రి స్వాధీనం

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం క్యాంపు సెంటర్ గ్రామంలో గుడుంబా తయారీకి ఉపయోగించే సామగ్రిని సోమవారం ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని మాసబత్తిని వెంకటరమణ ఇంట్లో 100 కిలోల బెల్లం, 5 కిలోల పటిక, 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ ఎస్సై అచ్చారావు తెలిపారు. వెంకటరమణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

బొగ్గు లారీ పట్టివేత

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి బొగ్గు లారీని పోలీసులు పట్టుకుని ఠాణాకు తరలించారు. లారీకి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బొగ్గు లారీ ఇటుక బట్టీల సమీపంలో ఉండటంతో ఇటుక బట్టీలకు బొగ్గు సరఫరా చేస్తున్నారా? అనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

పేకాట స్థావరంపై దాడి

సుజాతనగర్: మండలంలోని సర్వారం గ్రామ పంచాయతీ గోపాతండా గ్రామ శివారులో పత్తి చేలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.6800 నగదు, 3 మొబైల్ ఫోన్లు, 2 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.రమాదేవి తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

భద్రాచలంటౌన్: పట్టణ పోలీసులు సోమవారం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి వయసు 70 ఏళ్లు ఉంటుందని, బ్లూ కలర్ గీతలు కలిగి టీ షర్టు, వంకాయ రంగు లుంగీ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఇతను పట్టణంలోని బస్టాండ్ ఆవరణాలో భిక్షాటన చేస్తూ జీవంచేవాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 87126 82160 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

వంద రోజుల ప్రణాళిక విజయవంతం చేయాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళిక విజయవంతం చేసి, పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గురుకులం, ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. నైపుణ్యం కలిగిన విద్యార్థులతో పాటు డీ గ్రేడ్ పిల్లలను కూర్చోబెట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఆహార పదార్థాలను వార్డెన్, స్టాఫ్‌నర్స్ తనిఖీ చేయాలని, వంటగది, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్సీఓ నాగార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఉద్దీపకం బుక్‌లెట్ల ద్వారా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఐటీడీఏ బి.రాహుల్ ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ ప్రాంతాల ఆదివాసీ, గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని టేకులపల్లి మండలం బోడుకు చెందిన సమ్మయ్య, పోడు పట్టాలు ఉన్న భూములకు రైతుభరోసా ఇప్పించాలని అశ్వారావుపేట మండలం కన్నాయిగూడెం గ్రామస్తులు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత విద్యాశాఖపై సమీక్షించిన పీఓ పదో తరగతి విద్యార్థుల సన్నద్ధత, ప్రత్యేక తరగతుల నిర్వహణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు డేవిడ్‌రాజ్, రవీంద్రనాథ్, తానాజీ, సున్నం రాంబాబు, నాగార్జునరావు, భాస్కరన్, మునీర్‌పాషా, లక్ష్మీనారాయణ, ఉదయ్‌కుమార్, మణిందర్, నారాయణరావు, ఆదినారాయణ, ప్రమీలబాయి, సుశీల, పద్మావతి, మమత, హరికృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

టీ.టీ.లో జాతీయస్థాయి మూడో ర్యాంక్



కోటగిరి హితేష్

ఖమ్మం స్పోర్ట్స్/తల్లాడ: జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నీలో జిల్లాలోని తల్లాడకు చెందిన విద్యార్థి సత్తా చాటి మూడో ర్యాంక్ సాధించాడు. ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు జాతీయస్థాయి సబ్ జూనియర్ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు జరిగాయి. ఇందులో తల్లాడ బాలభారతి విద్యాలయం ఆరో తరగతి విద్యార్థి కోటగిరి హితేష్ మూడో ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడు. ఈసందర్భంగా విద్యార్థిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీవీఎస్.సాంబమూర్తి, ఎంఈఓ దామోదరప్రసాద్, కేఎస్ఎం విద్యాసంస్థల చైర్మన్ కోటగిరి ప్రవీణ్‌తో పాటు ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఏఓ శశాంత్‌తో పాటు చలపతి, శృతి, మజార్, రామారావు, జోజిచాక్, కామేశ్వరీరెడ్డి, భవ్యచందు, సాయిశివ అభినందించారు.

'మభ్యపెట్టి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్'



చార్జ్‌షీట్ విడుదల చేస్తున్న బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు

సత్తుపల్లి/వేంసూరు: మాయమాటలతో మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏ హామీని అమలుచేయకుండా ప్రజలను మోసం చేసిందని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ విమర్శించారు. సత్తుపల్లిలో సోమవారం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ పాలనపై చార్జీషీట్ విడుదల చేశారు. ఈసందర్భంగా సత్యనారాయణ, నాయకులు మాట్లాడుతూ పదే పదే పార్టీలు మారే నాయకులకు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాగా, అబద్ధపు హామీలతో ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. తొలుత బీజేపీ నాయకులు వేంసూరు మండలంలోని వేంసూరు, మర్లపాడు, భీమవరం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు తాండ్ర వినోద్‌రావు, బి.వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, నాయుడు రాఘవరావు, మట్టా ప్రసాద్, పాలకొల్లు శ్రీనివాస్, నాగస్వామి, రామారావు, రాంబాబు, నర్సింహారావు, బాలకృష్ణారెడ్డి, దొడ్డపనేని కృష్ణయ్య, పర్స రాంబాబు, మట్టా ప్రసాద్, బాలకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరుకు నాటేందుకు యంత్రం !



చెరుకు మొక్కలు నాటే యంత్రం పనితీరును వివరిస్తున్న సిబ్బంది

నేలకొండపల్లి: చెరుకు సాగులో కూలీల కొరతను అధిగమించేందుకు మండలంలోని మధుకాన్ షుగర్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం మొక్కలు నాటడంతో పాటు కోతలకు యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈసందర్భంగా సోమవారం మండలంలోని బోదులబండ, మంగ్రాజుపల్లి, కోనాయిగూడెంల్లో సీడ్లింగ్స్ ప్లాంటర్ యంత్రం ద్వారా చెరుకు మొక్కలు నాటే విధానంపై అవగాహన కల్పించారు. రూ.2.50 లక్షల విలువైన ఈ యంత్రాన్ని తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి తెప్పించగా రోజుకు ఐదు నుంచి ఏడు ఎకరాల్లో మొక్కలు నాటొచ్చని తెలిపారు. అలాగే, చెరుకు నరికే యంత్రం పనితీరును వివరించారు. మార్కెట్ మాజీ చైర్మన్ సూరపనేని రామకృష్ణతో పాటు కట్టికోల సుధాకర్, చింతనిప్పు సైదులు, కొచ్చెర్ల శ్రీనివాసరావు, మేకల నారాయణ, మధుకాన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బడ్డీ కొట్టులో చోరీ

మధిర: మండలంలోని సిరిపురంలో పెట్రోల్ బంక్ సమీపాన ఉన్న సాతుపాటి లక్ష్మికి చెందిన బడ్డీ కొట్టులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి లోపల ఉన్న నగదు, సరుకులను అపహరించారు. అంతే కాక కూల్‌డ్రింక్స్ ఫ్రిడ్జిని ధ్వంసం చేశారు. చిరువ్యాపారంతో జీవనం సాగిస్తున్న తన కొట్టులో చోరీతో తీవ్ర నష్టం ఎదురైందని బాధితురాలు వాపోయింది. కాగా, మండలంలో ఇటీవల వరుస చోరీలు జరుగుతున్న నేపథ్యాన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రిపూట పోలీసు పెట్రోలింగ్ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ఒంటరి మహిళపై లైంగికదాడి

రఘునాథపాలెం: మండలంలోని ఓ గ్రామంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. సదరు వివాహిత భర్త గత ఏడాది క్రితం మృతి చెందడంతో ఒంటరిగా జీవిస్తోంది. అదేగ్రామానికి చెందిన జానీ రాత్రి ఆమె ఇంట్లోకి దూరి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్



■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9177555694 [SCA24000795]



■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253941]

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే (GST 5% అదనం)

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.